క్లుప్తంగా

తాగునీటి కుళాయిలు ప్రారంభం



వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీటిని పంపిణీ చేస్తున్న గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు సూరాడ రాజు

కాకినాడ రూరల్: మత్స్యకార గ్రామం సూర్యారావుపేటలో తాగునీటి సమస్యకు మోక్షం లభించింది. గ్రామంలో తాగునీటి సమస్యను మహిళలు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకురావడంతో ఆయన ఇంటింటికి కుళాయి ద్వారా నీటిని అందించేందుకు ఓహెచ్ఆర్ ట్యాంకును మంజూరు చేశారు. ట్యాంక్ నిర్మాణం పూర్తయ్యి కుళాయిలు ఏర్పాటు చేయడంతో సోమవారం నుంచి గ్రామ పంచాయతీ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని విడుదల చేశారు.

ఉప్పలంకలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఉప్పలంకలో పింఛన్‌దారులతో కలిసి సీఎం జగన్‌కు చిత్రపటానికి క్షీరాభిషేకం

కరప: పింఛను సొమ్ము పెంచినందుకు కృతజ్ఞతగా కరప మండలం ఉప్పలంక గ్రామసచివాలయంలో సోమవారం గ్రామసర్పంచ్ బొమ్మిడి నయోమి, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్‌లు పింఛన్‌దారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొత్తగా పింఛను మంజూరైన 28 మందితో కలిపి గ్రామంలోని 353 మంది పింఛన్‌దారులకు సర్పంచ్ నయోమి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్‌లు పింఛన్ సొమ్ము రూ 2,750 నగదుతోపాటు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరావు, గ్రామకార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్, ఉపసర్పంచ్ అరదాడి భవానీ, గ్రామస్తులు అంగాడి వీరబాబు, ఆకుల ధర్మారావు, ఓలేటి నాగేశ్వరరావు, పెనుపోతు దుర్గారావు, పాలెపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గంధోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: జగన్నాథపురంలోని చిన్నమసీదులో కాదర్‌వలీ నాగూర్‌మీరా జెండా నిషానీ గంధోత్సవం సోమవారం రాత్రి భక్తిప్రదంగా సాగింది. ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరై దర్గాలో ప్రార్ధనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మసీదుల అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారని చెప్పారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు సంగాని నందం, రోకళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రయోజనకర స్టార్టప్‌లపై దృష్టిసారించాలి

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): సమాజ ప్రయోజకర స్టార్టప్‌లపై దృష్టి సారించి విద్యార్థులను ప్రోత్సహించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. వర్సిటీ ఇంక్యూబేషన్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కె.వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లినికల్ ల్యాబ్‌కు రూ.లక్ష విరాళం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సామాజిక సేవలో భాగంగా నిర్మిస్తున్న డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు సోమవారం ప్రముఖ వ్యాపారవేత్త పెదిరెడ్డి కృష్ణమూర్తి తన నివాసంలో రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బాలకృష్ణ, పెదిరెడ్డి సతీష్, రామచంద్రరావు, సురేష్ పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కరప: ఒక పేకాట శిబిరంపై కరప పోలీసులు దాడి చేసి, నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ 1,520 నగదు, 104 పేకలను సీజ్ చేశారు. కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ కథనం ప్రకారం.. కరప మండలం వేములవాడలో పేకాడుతున్నట్టు సోమవారం సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఎస్‌ఐ రామకృష్ణ దాడిచేశారు. అక్కడ పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. మంగళవారం కాకినాడ కోర్టులో నిందితులను హాజరు పరుస్తామని ఎస్‌ఐ రామృష్ణ తెలిపారు.

వైకుంఠ.. వైభోగమే..

- ఉత్తర ద్వార దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- సర్పవరం భావనారాయణస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు



సర్పవరం భావనారాయణస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



సర్పవరం జంక్షన్ వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల బారులు



సర్పవరం ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కాకినాడ రూరల్: ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి) సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం సర్పవరంలోని ప్రసిద్ధ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ముక్కోటి సందడి నెలకొంది. తెల్ల వారు జామున ప్రత్యేక పూజలు అనంతరం ఉత్తర ద్వారం ద్వారా ఆలయాలకు భక్తులను అనుమతివ్వడంతో అప్పటికే క్యూలలో బారులు తీరి భక్తులు దర్శనాలు చేసుకున్నారు. సర్పవరం ఆలయంలో తెల్ల వారు జామున 5గంటలకు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా అనుమతించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు, కుటుంబ సభ్యులు కురసాల సత్యనారాయణ దంపతులు, కురసాల కళ్యాణ్‌కృష్ణ, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు దంపతులు తదితరులు దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సర్పవరం జంక్షన్ మెయిన్‌రోడ్డులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి వేడుకలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో దర్శనాలు చేసుకున్నారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

అర్చకుడు పవన్ స్వామి వారిని పాల సముద్రంలో ఉన్నట్టు అలంకరించారు. వాకలపూడి సంతోష్‌నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు కొండలశర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముక్కోటి వేడుకలు ఘనంగా జరిగాయి. కాకినాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గాంధీనగర్‌లో వేంకటేశ్వరస్వామి



జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు



జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి ఉచిత దర్శనంతో పాటు, ఇతర దర్శనాల కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానిక దేవాలయంవీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు రామకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దర్శనం కోసం క్యూలు కట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్థానిక గాంధీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనం కోసం క్యూలు కట్టారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు అందించారు. స్థానిక భానుగుడి వద్ద ఉన్న భానులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని వాసవీకన్యాకపరమేశ్వరి అమ్మవారిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. స్థానిక మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామికి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సుమారు రెండు గంటలు సేపు దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. స్థానిక పళ్లంరాజునగర్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి మహాలక్ష్మి దంపతులు నగరంలోని వెంకట్‌నగర్, జగన్నాథపురం, గాంధీనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో సంతృప్తి

- 2024 తర్వాత బాబు అడ్రస్ గల్లంతు
- గడపగడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వచ్చే 2024 ఎన్నికల తరువాత టీడీపీ అడ్రస్ గల్లంతు కావడం తథ్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలయ్యాక చంద్రబాబు ఆంధ్రాను వదిలి హైదరాబాద్ వెళ్లిపోతారన్నారు. స్థానిక 10వ డివిజన్ దుమ్ములపేటలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్నసాగర్, కమిషనర్ కె.రమేష్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు లాంటి నాయకుడు ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. ఆయన సభలకు జనం లేక, ప్రజలు రాకపోవడంతో ఇరుకు సందుల్లో సభలు పెట్టి ప్రజలను చంపుతున్నారని ద్వారంపూడి విమర్శించారు. సంవత్సరం ఆఖరిలో ఎనిమిది మందిని, కొత్త సంవత్సరంలో ముగ్గురిని పొట్టన పెట్టుకున్నారని, చివరకు బహుమతులు ఇస్తామంటూ మభ్యపెట్టి ప్రజలకు రప్పించుకునే స్థాయికి చంద్రబాబు దిగజారిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని మూడో విడత రూ.2500 నుంచి రూ.2750కు పెంచడంపై పెన్షన్‌దారుల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు. ఈ నెలాఖరు నాటికి డ్వాక్రా సొమ్ము కూడా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇలాంటి సంక్షేమ ప్రభుత్వంలో పనిచేసే అవకాశం దక్కడం ఒక ప్రజాప్రతినిధిగా అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, స్థానిక నాయకులు మోసాపేటూరు, ఎరుపల్లి సీతారామ్, తిరిధి జగన్నాథం, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, సంగాని నందం, కంపర బాబి, నగర బీసీసెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, డిఈ మాధవీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



కరప విష్ణాలయంలోని వేణుగోపాలస్వామి



యండమూరులో మీసాల వేంకటేశ్వరస్వామి

కరప: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పవిత్ర వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి, అదే ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వరస్వామికి ప్రధాన అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, సూర్యనారాయణ, వాడపల్లి దీక్షితులు విశేష పూజలు చేశారు. స్వామివారిని తులసి, చామంతి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మహిళలు అధికసంఖ్యలో వచ్చి వ్రతమాచరించి, గీతాపారాయణం చేశారు. దేవదాయశాఖ ఈఓ వడ్డాది సత్తిబాబు భక్తులకు ఉత్తరద్వారం ఏర్పాటు చేసి, అన్ని ఏర్పాట్లు చేశారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పెద్దింటి సీతారామాచార్యులు పూజలు నిర్వహించారు. పెనుగుదురు, జెడ్.భావారం, కూరాడ, చినమామిడాడ తదితర గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో, యండమూరు, కొంగోడు, పెనుగుదురు, వేళంగి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా వైకుంఠ ఏకాదశి పూజలు జరిపి, భక్తులకు ఉత్తరద్వార దర్శనం చేయించారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు



జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లా స్థాయిలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని షూటింగ్ క్రీడాకారులకు కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా సూచించారు. త్రివేండ్రంలో జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టు ట్రయల్స్‌కు ఎంపికైన డి.అక్షయ, 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్ షిప్ (రాష్ట్ర స్థాయి) రైఫిల్ షూటింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఎ.త్రితేజ్, అదే విధంగా అండర్–17 పిస్టల్ విభాగంలో బంగారు పతకం సాధించిన జి.మౌనిప్రసన్న తదితరులు సోమవారం స్పందన హాల్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకారులను అభినందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్ యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం: మద్యం మత్తులో బిహార్ వాసి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిహార్ రాష్ట్రం, సుపాల్ జిల్లా, బాకూరు గ్రామానికి చెందిన శంకర్ కుమార్ సాదా(22) తన రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురు యువకులతో కలిసి ఏడు నెలల క్రితం కాకినాడకు వచ్చి పోర్టులో పనిచేస్తున్నాడు. వీరందరూ నగరంలోని దూదిమిల్లు సమీపంలో ఓ గది అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. నిత్యం మద్యం సేవించే శంకర్ రోజూ లానే తాగి గొడవ చేస్తుండగా ఆదివారం రాత్రి గది బయటే శంకర్‌ను వదిలి మిగిలిన ముగ్గురు గదిలో నిద్రపోయారు. ఉదయాన్నే వారు లేచే సరికి గది బయట ఉన్న దూలానికి శంకర్ తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం గమనించారు. పోలీసులకు సమాచారం అందించగా మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారించి, మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కాకినాడ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తన ఇంటిని ఇప్పించాలంటూ ఫిర్యాదు

కాకినాడ సిటీ: తనకు వారసత్వంగా వచ్చిన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని, తన ఇంటిలోకి రాకుండా దౌర్జన్యం చేస్తూ అడ్డుకుంటున్నారని, తన ఇంటి వాటాను తనకు ఇప్పించాలని కోరుతూ కాకినాడ రూరల్ వాకలపూడి సంతోష్‌నగర్‌కు చెందిన పిల్లి సీతారాణి సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. తన తల్లి పిల్లి విష్ణువేణి పేరు మీద సంతోష్‌నగర్‌లో రెండంతస్తుల భవనం ఉందని, దీనికి ఐదుగురు వారసులమన్నారు. తనకు వచ్చిన వాటాలో తాను నివాసం ఉండే దానినని, కొన్నాళ్ల క్రితం తన అత్తమామల ఇంటికి గుంటూరు వెళ్లి.. తిరిగి వచ్చేసరికి నా ఇంటి తాళం బద్దలు కొట్టి ఇంద్రపాలేనికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని సీతారాణి కలెక్టర్‌కు వివరించారు. తనను ఇంట్లోకి రానీయకుండా కుక్కలను వదులుతున్నారని, తనపై దౌర్జన్యం చేసి బయటకు పంపిచేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వాకలపూడి పంచాయతీ కార్యదర్శిని లోబరుచుకొని ఆమెతో ఇంటి పన్ను రసీదులు కూడా రద్దు చేయించారని వివరించారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకొని తన ఇంటి వాటాను తనకు ఇప్పించాలని కోరారు.

ఆకట్టుకొన్న నృత్య ప్రదర్శన



ప్రశంసాపత్రాలతో డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ముందుగా నాట్యవేద కూచిపూడి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్యరూపకాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. అనంతరం సమాజ సేవకులు డాక్టర్ సుబ్బారావు, సీతామహాలక్ష్మి దంపతులను సత్కళావాహిని అనుబంధ సంస్థ యువవాహిని సభ్యులు సత్కరించారు. డాక్టర్ సుబ్బారావు సేవలను పలువురు వక్తలు కొనియాడారు. నాట్యాచార్య కోట దివాకర్‌ను సత్కరించారు. అకాడమీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చిట్టూరి రాఘవమ్మ, లక్ష్మీనారాయణమ్మ, శ్రీకృష్ణ, కుంజుక లక్ష్మి, తురగా సూర్యారావు, రామకృష్ణ, శారద తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల విద్యార్థులకు రూ.8.64 లక్షల పుస్తకాల పంపిణీ

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థుల సౌకర్యార్థం కలెక్టర్ కృతికా శుక్లా సుమారు రూ. 8.64 లక్షల వ్యయంతో మొదటి, రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు టెక్స్ట్ అందించారు. ఓఎన్‌జీసీ కాకినాడ వారి సీఎస్సార్ నిధులతో కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక చొరవతో ఈ పుస్తక వితరణ జరిగింది. వీటిని విద్యార్థుల కోసం ఆయా కళాశాలల లైబ్రరీలలో ఉంచి అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కాకినాడ జిల్లా కోఆర్డినేటర్ ఎ.మురళీకృష్ణ విద్యార్థులతో కలిసి కలెక్టర్ కృతికా శుక్లాకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన గడ్డి ట్రాక్టర్

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డును అనుకుని తిమ్మాపురం పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. పెట్రోలు బంకును ఆనుకుని వెనుక వైపు ఉన్న స్థలంలో గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ అగ్నిప్రమాదానికి గురైంది. పెనుమర్తి నుంచి ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకుని బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో అన్‌లోడ్ చేసే ప్రయత్నంలో ఉండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. వీటిని చూసి బంకులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుందనే అనుమానంతో ఏడీబీ రోడ్డు మీదుగా వెళ్లే వారు భయాందోళనకు గురయ్యారు. బంకు నిర్వాహకులు, గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ స్పందించి జేసీబీ ద్వారా ప్రమాదానికి గురైన ట్రాక్టర్ తొట్టెను పక్కకు నెట్టివేయించడంతో ప్రమాదానికి అడ్డుకట్టపడింది. సాలిపేట అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో గడ్డితో పాటు ట్రాక్టర్ కూడా స్వల్పంగా దగ్ధం కావడంతో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థలదానం



స్థల డాక్యుమెంట్లను ఎమ్మెల్యే కన్నబాబుకు అందజేస్తున్న దాత రెడ్డి శ్రీనివాసరావు

కాకినాడ: మండలంలోని కొవ్వూరు గ్రామంలో జలజీవన్‌మిషన్ పథకం నిధులతో ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాసరావు తన స్థలాన్ని దానం చేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి సుమారు రూ.9లక్షల విలువైన మూడు సెంట్లు స్థలం డాక్యుమెంట్లను ఎమ్మెల్యే కన్నబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత రెడ్డి శ్రీనివాసరావును ఎమ్మెల్యే కన్నబాబు అభినందించారు. కొవ్వూరు గ్రామ ప్రజలకు ఇంటింటికి కుళాయిల ఏర్పాట్లలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ పిల్లి చక్రరావు, నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీం బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉప్పటేరులో బోటు దగ్ధం



దగ్ధమవుతున్న బోటు

కాకినాడ క్రైం: కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఉప్పుటేరులో సోమవారం ఓ బోటు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. సైలెన్సర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్టు సాలిపేట ఫైర్‌స్టేషన్ ఎస్ఎఫ్‌వో ఏసుబాబు తెలిపారు. బోటులో డీజిల్ ఉండటంతో మంటలు వ్యాపించాయన్నారు. సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలిపారు. బోటు యజమాని ఓలేటి గిరిబాబు ఫిర్యాదు మేరకు, కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్పుల్ లేన్ సేవలు విస్తృతం చేయాలి

బాలాజీచెరువు: పర్పుల్ లేన్ సంస్థ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సేవలు మరింత విస్తృతం చేయాలని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు సూచించారు. పర్పుల్ లేన్ అధికార ప్రతినిధి వార వినోద్ సోమవారం వీసీ ప్రసాద్‌రాజును కలిసి 2023లో అందిస్తున్న ట్రెనింగ్ కోర్సు వివరాలు వెల్లడించారు. శిక్షణ తీసుకుని ఉద్యోగాలు పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యూఆర్‌సీ కార్యాలయాన్ని మార్పు చేయాలి

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డు సిద్ధార్థనగర్‌లో ఉన్న యూనిట్ రన్ క్యాంటీన్ భవనం సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, యూఆర్‌సీ కార్యాలయాన్ని వలపాకలలో ఉన్న భవనంలోకి మార్చాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం కోరింది. సిద్ధార్థనగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం కాకినాడ అధ్యక్షుడు ఎస్.ఎఫ్.జె.కెనడీ మాట్లాడుతూ యూఆర్‌సీ కాకినాడ యూనిట్‌ను ఏర్పాటు చేసి 20 ఏళ్లయ్యిందన్నారు. ఇక్కడకు వచ్చే మాజీ సైనికులకు కనీస సదుపాయాలు లేవని దీనిపై ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఏకే రుషికి విన్నవించామన్నారు.

మహావిష్ణు అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి సోమవారం భక్తులకు మహావిష్ణు అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ఆల య అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారు మహావిష్ణు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న డీఆర్వో, జెడ్పీ సీఈవోలు

కాకినాడ సిటీ: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎస్సార్ కార్యక్రమం ద్వారా ఆర్టిఫీషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో), కాకినాడ జిల్లా పరిపాలనా యంత్రాంగం సహకారంతో 15 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే సైకిల్, వినికిడి మెషీన్లు పంపిణీ చేశారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో దివ్యాంగులకు ఉపకరణాలను జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి, సీపీవో పి.త్రినాథ్, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, పవర్‌గ్రిడ్ అధికారి ఏఎస్ఎన్ మూర్తి తదితరులు అందించారు. ఈ సందర్భంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారి మూర్తి మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద దేశ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.